18వ
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
శనివారం,21 డిసెంబర్ 2024 8 పేజీలు


# మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్



**నూజివీడు,మేజర్‌న్యూస్:**నూజివీడు సబ్ కలెక్టర్‌గా నియమితులైన స్మరణ్‌రాజ్ రాష్ట్రగృహనిర్మాణ శాఖ,సమాచారపౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి వారిని మర్యాద పూర్వకంగా కలిశారు. నూజివీడు ట్రిపుల్ ఐటిలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథిని కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారధి సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్‌ను అభినందిస్తూ నూజివీడు రెవిన్యూ డివిజన్‌లో ప్రభుత్వం అమలుచేసే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అంకితభావంతో ప్రగతిపథంలో ఉంచాలని సూచించారు.అనంతరం ఇరువురు నియోజక వర్గానికి సంబంధించిన అంశాలపై చర్చించారు.

## యువతకు బంగారు భవిష్యత్తు

# అందించేందుకు సీఎం కృషి

### రానున్న ఐదేళ్లల్లో 20 లక్షలమంది యువతకు ఉద్యోగ అవకాశాలు
### -రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి పార్థసారథి





**నూజివీడు,మేజర్‌న్యూస్ :** ప్రపంచస్థాయి సాంకేతికతను రాష్ట్రానికి తీసుకువచ్చి యువతకు బంగారు భవిష్యత్తు అందించే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. నూజివీడు త్రిబుల్ ఐటీ లో శుక్రవారం 'మెగా జాబ్ మేళా'ను మంత్రి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యా,ఉద్యోగ,ఉపాధి కల్పనకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు.రానున్న5 సంవత్స రాలలో రాష్ట్రంలోని 20లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని,

- తరువాయి 2లో..





# ఉండి పంచాయతీలో సర్పంచ్, వార్డు సభ్యుల మధ్య ఘర్షణ

### - బహిరంగంగా కొట్టుకున్న సభ్యులు

**ఉండి/భీమవరం,మేజర్‌న్యూస్:** ఉండి పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం బోర్డు మీటింగ్ అనంతరం సర్పంచ్ కమతం సౌజన్య, వార్డు మెంబర్ల మధ్య వాగ్వాదం తీవ్ర ఘర్షణగా మారింది. సర్పంచ్, వార్డు మెంబర్లు, వారి బంధువుల మధ్య బహిరంగంగా తిట్టుకున్న తరుణంలో పరస్పరం దాడులకు దారితీసింది. ఈ ఘటనతో పంచాయతీ కార్యాలయం హోరాహోరీ తలపించింది. సర్పంచ్ సౌజన్య మాట్లాడుతూ, మహిళా వార్డు మెంబర్ల భర్తలు బోర్డు సమావేశానికి రావద్దని చెప్పినందుకే కొందరు సభ్యులు అసహనానికి గురై తమపైదాడి చేశారనిఆరోపించారు.

- తరువాయి 2లో..

# జిల్లా కలెక్టర్‌తో నూజివీడు సబ్ కలెక్టర్ భేటీ



**నూజివీడు,మేజర్‌న్యూస్ :** నూజివీడు సబ్‌కలెక్టర్‌గా నియమితులైన బచ్చు స్మరణ్ రాజ్ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి వారిని శుక్రవారం నూజివీడు ట్రిపుల్‌ఐటిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం విధుల్లో చేరిన సబ్ కలెక్టర్‌కు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి శుభాకాంక్షలు తెలిపారు.సివిల్స్ 676 ర్యాంక్ విజేత అయిన స్మరణ్ రాజ్ (2022 ఐఎఎస్ బ్యాచ్) చెన్నై ఐఐటిలో కెమికల్ ఇంజనీరింగ్(బిటెక్) పూర్తిచేశారు.

## యండగండిలో

# పార్శిల్‌లో మృతదేహం

### - సంచలనం కలిగించిన సంఘటన - విచారణ చేపట్టిన ఎస్‌పి నయీమ్ అస్మి





**ఉండి/భీమవరం,మేజర్‌న్యూస్:**ఉండి మండలం, యండగండి గ్రామంలో పార్శిల్లో మృతదేహం సంఘటన కలకలం రేపింది. ముదునూరి రంగరాజు అనే వ్యక్తిఇంటికి చేరిన పార్శిల్‌ను తెరవగానే అందులో మృతదేహం ఉండడం, దుర్వాసన రావడం భయాందోళనలకు కారణమైంది. రంగరాజు పెద్ద కూతురు సాగి తులసి,భర్తతో విడిపోయి గరగపర్రు గ్రామంలో నివాసం ఉంటూ భీమవరం దుర్గ స్టిల్స్‌లో ఉద్యోగం చేస్తోంది. తులసి ఆర్థిక పరిస్థితి దృష్ట్యా క్షత్రియ ఫౌండేషన్ ద్వారా

- తరువాయి 2లో..

## నిబంధనలు మీరి

# డ్రైవింగ్ చేస్తే చర్యలు

### - జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరిక




**భీమవరం,మేజర్‌న్యూస్:** శుక్రవారం స్థానిక వశిష్ట సమావేశ మందిరం నందు జిల్లా స్థాయి రహదారుల భద్రత సమావేశం జిల్లాకలెక్టర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈసమావేశంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, తాడేపల్లి గూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా రోడ్డు భద్రతా చర్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు నిబంధనలు విరుద్ధంగా డ్రైవింగ్ చేయడం,దీనికారణంగా ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని గుర్తించడం జరిగిందన్నారు.హెల్మెట్ లేకుండా, సెల్ఫోన్ వినియోగిస్తూ, త్రిబుల్ రైడింగ్ చేయడం నిబంధనలు విరుద్ధమని వెయ్యి రూపాయలు జరిమానాతో పాటు, మూడు నెలలపాటు లైసెన్స్ రద్దుచేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. యువత వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తగా ఉండాలని

- తరువాయి 2లో..

# యువతకు బంగారు భవిష్యత్తు అందించేందుకు సీఎం కృషి

మొదటిపేజి తరువాయి

అంతేకాక ప్రతీ ఇంటి నుండి ఒక పారిశ్రామికవేత్తను రూపొందించేలా ప్రత్యేక పారిశ్రామిక పాలసీని రూపొందిస్తున్నామన్నారు. పాపులేషన్ సెన్సస్ లాగా 'స్కిల్ సెన్సస్' నిర్వహించి ప్రతీ ఇంటోలో యువత ఏఅంశంలో నైపుణ్యం కలిగి ఉన్నది సెన్సస్ చేపడుతున్నా మన్నారు. అంతేకాక ప్రపంచస్థాయి సంస్థలు మన రాష్ట్రంలో పరిశ్రమలు నెల కొల్పేలా చర్యలు తీసుకుంటున్నామని, వారికి కావలసిన రంగంలో మన యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి ఆయాపరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలోని 175నియోజకవర్గాలలో స్కిల్‌హబ్‌లు ఏర్పాటుచేసి,యువతను అన్ని రంగాలలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉద్యోగఅవకాశాలు కల్పిస్తున్నా మన్నారు. 2047 స్వర్ణాంధ్రకార్యాచరణ ప్రణాళికలో నైపుణ్యాభివృద్ధి, యువతకు ఉద్యోగ కల్పన అంశానికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని మంత్రి చెప్పారు. ఎన్టీపీసీ సంస్థ1.87 లక్షల కోట్ల రూపాయలతో సంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధి యూనిట్ స్థాపించనున్నదని, దీనిద్వారా 1.06లక్షల మంది యువతఉద్యోగ అవకాశాలు లభిస్తాయ న్నారు. విద్యా శాఖామంత్రి నారా లోకేష్ ఇటీవల విదేశీ పర్యటనలో గూగుల్ సంస్థతో సంప్రతించి గూగుల్ సంస్థ తన యూనిట్‌ను రాష్ట్రంలో నెలకొల్పేలా చర్యలు తీసుకున్నారన్నారు. అదేవిధంగా వేలకోట్ల రూపాయలతో మన రాష్ట్రంలో తన యూనిట్ ను నెలకొల్పేందుకు వచ్చిన మిట్టల్ స్టీల్ సంస్థ గత ప్రభుత్వ హయాంలో పరిస్థితులు అనుకూలించని కారణంగా ఒరిస్సాలో నెలకొల్పేందుకు ఆలోచిస్తుండగా, ముఖ్యమంత్రి చొరవతో తిరిగిమన రాష్ట్రంలో నెలకొల్పేందుకు అగ్రిమెంట్ కుదుర్చుకుం దన్నారు. రిలయన్స్ సంస్థ 65 వేల కోట్ల రూపాయలతో 500 కంప్రెస్డ్ బయో గ్యాస్ యూనిట్లు నెలకొల్పేలా మంత్రి లోకేష్ చొరవ తీసుకున్నా రన్నారు. ఈ విధంగా ప్రపంచ స్థాయి దిగ్గజ సంస్థలు, అదే స్థాయి టెక్నాలజీతో తమ యూనిట్లను మన రాష్ట్రంలో నెలకొల్పి మన యువతకు ఉద్యోగ అవకాశాలుకల్పించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు.జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 8 స్కిల్‌హబ్స్‌లలో యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. స్వర్ణాంధ్ర కార్యాచరణ ప్రణాళికలో కూడా నైపుణ్యాభివృద్ధి, యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనపై ప్రత్యేక స్థానం కల్పించామన్నారు. జిల్లాలో ఏ పరిశ్రమలలో ఏ ఏ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. వాటికి ఏఏ విభాగంలో నైపుణ్యం అవసరం అని తెలుసుకుని వాటిల్లో యువతకు శిక్షణ అందించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు.

**జిల్లా కలెక్టర్ పనితీరుకు మంత్రి ప్రశంసలు..** ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పనిచేస్తున్నారని మంత్రి పార్థసారథి కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పేద ప్రజలకు అవగాహన కల్పించి వాటిని వారు సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నా రన్నారు.కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ రాజ్, త్రిబుల్ ఐటీ విసి అమరేంద్ర కుమార్, డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయరాజు,స్కిల్ డెవలప్మెంట్ అధికారి జితేంద్ర కుమార్, ప్రభృతులు పాల్గొన్నారు. అనంతరం జాబ్ మేళాకు దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి మరిన్ని హెల్ప్ డెస్క్ లు ఏర్పాటుచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## చంద్రిక టిఫిన్స్ సెంటర్‌పై కమిషనర్ ఆకస్మిక తనిఖీ



**భీమవరం,మేజర్‌న్యూస్:** జువ్వలపాలెం రోడ్డులో ఉన్న చంద్రిక టిఫిన్స్ సెంటర్‌లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కె. రామచంద్ర రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో ఆటిఫిన్ సెంటర్ వ్యర్థాలను డ్రైనేజీలో పడవేయడం, పారిశుద్ధ నిర్వహణ సరిగా లేనట్లు గుర్తించారు. కిచెన్ వ్యర్థాలు నిర్లక్ష్యంగా డ్రైనేజీలో పడవేయడంతో శానిటేషన్ సిబ్బందికి ఇబ్బందులు కలుగుతున్నాయని కమిషనర్‌తెలిపారు.అపరిశుభ్ర వాతా వరణంలో ఆహారాన్ని తయారు చేయడం, అధిక మోతాదులో ఆహార రంగు పదార్థాలు వాడడం వంటి చర్యల వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతుందని కమిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని టిఫిన్ సెంటర్‌కు భారీ అపరాధ రుసుము విధించి, తాత్కాలికంగా మూసివేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. టిఫిన్ సెంటర్ యజమానిని నిబంధనలు పాటించాలని, వ్యర్థాలను సరిగ్గా నిర్వహించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల వల్ల పారిశుద్ధంపై మున్సిపల్ శాఖ దృష్టి పెడుతూ, ఇతర ఆహార కేంద్రాలు సైతం తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## నేడు భీమడోలు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్తుకు అంతరాయం

**ఏలూరు,మేజర్‌న్యూస్:** విద్యుత్ ఈనెల 21 వ తేదీ శనివారం భీమడోలు సెక్షన్ పరిదిలోని 220/132/33 కెవి భీమడోలు సబ్–స్టేషన్ పరిదిలోని కండక్టర్ మార్పు చేయుటవలన ఈ క్రింది పరిదిలోని ఉన్న సబ్ స్టేషన్స్‌లో ఉన్న అన్ని 11కేవీ ఫీడర్లకు అంతరాయము కలుగుతుందని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు సరఫరా నిలిపి వేయబడునని, కావున పెదవేగి మండలం పరిధిలో ఉన్న పెదవేగి, గార్లమడుగు, కవ్వ గుంట, వేగివాడ కూచిపూడి, న్యాయంపల్లి, రామసింగవరం,మండూరు, తాళ్లగోకవరం, గ్రామములకు సరఫరా అంతరాయము కలుగుతుందని,కావున వినియోగ దారులు సహకరించ వలసిందిగా అంబేద్కర్ విజ్ఞప్తి చేశారు.

## 'అల్లుళ్లొచ్చారు.. సంక్రాతికి' చిత్రీకరణ ప్రారంభం




**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్:** అనన్యచిత్రం డైరెక్టర్ బి.ప్రసాద్‌రాజువర్మ మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై 'అల్లుళ్లొచ్చారు. సంక్రాతికి' అనే కొత్త వోటిటి సినిమా గంగా నమ్మ గుడి వద్ద శుక్రవారం చిత్రీకరణ మొదలు పెట్టారు. నూతన నటీ నటులపైన స్థానిక జెడ్పిటిసి మెంబర్ పోల్నాటి బాబ్జి క్లాప్ కొట్టగా తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు పెనుమర్తి రామ్ కుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా,మరో సీనియర్ నేత రాజాన పండు మొదటి షాట్ కు దర్శకత్వం వహించారు. అలాగే పట్టణంలోని ఎంటీఆర్ సెంటర్ లో రెగ్యులర్ షూటింగ్ కోసాగించారు. ప్రారంభ కార్యక్రమంలో గంగానమ్మ ఆలయం కమిటీ చైర్మన్ కలగర వీర్రాజు, బిజెపి పట్టణ అధ్యక్షులు కొప్పాక శ్రీనివాస్ ,సిటీ కేబుల్ ఎండి శ్రీనివాస్ పాలపర్తి,జనసేన అధ్యక్షులు మేకా ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.చిత్రీకరణలోనటీ నటులు అరవింద్ జాలా,కిషోర్ నాగ దుర్గారావు, ఈశ్వర వర ప్రసాద్,నాగ మల్లేశ్వరరావు, జ్యోతి,నవ్యశ్రీ,నిహారిక తదితరులు పాల్గొ న్నారు.ఈ చిత్రానికి నిర్మాత మోహిని రాణి,కో –డైరెక్టర్ వాసు,డిఓపి రాజ్ కిరణ్,మ్యూజిక్ సిఏ రాజ్ కుమార్,మేకప్ శైలజప్రొడక్షన్ ఇంచార్జి, పిఆర్ఓ కేఎస్ శంకర రావు సాంకేతిక వర్గంగా వున్నారు.

## వ్యక్తి ఆత్మహత్య ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు

**భీమడోలు,మేజర్‌న్యూస్:** కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామానికి చెందిన నాళం శివ గణేష్ (28 సం.లు) అను వ్యక్తికి వివాహమై ఒక బాబు సంతానం అయినట్లు గత పది సంవత్సరాల నుండి అతను భీమడోలు మండలంలోని లిక్సిల్ సెరామిక్స్ కంపెనీలో టీం లీడర్ గా పనిచేస్తు, భీమడోలు గ్రామంలో భార్యా పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నట్లు ఈ నెల 1వ తేదీ మధ్యాహ్న సమయంలో శివ గణేష్ ఇంటి వద్దనే మద్యం తాగుతుంటే దానిపై భార్య అయిన లక్ష్మీ ప్రసన్న మద్యం తాగవద్దని ఆరోగ్యం పాడవుతుందని మందలించింది. దానితో ముస్తాపం చెందిన శివ గణేష్ ఇంటి నుండి బయటకు వెళ్లిపోయి కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చి కలుపు మందు తాగాను అని చెప్పగా వెంటనే అతని భార్య



భీమడోలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చేర్పించింది. అక్కడ నుండి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి చేర్చగా అక్కడ వైద్యం పొందుతూ ఈ నెల 19వ తేదీన మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో మృతుడు గడ్డి మందు ప్రభావం నుండి కోలుకోలేక చనిపోయినట్లు అతని భార్య లక్ష్మీ ప్రసన్న ఇచ్చిన ఫిర్యాదుపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉండి పంచాయతీలో సర్పంచ్, వార్డు సభ్యుల మధ్య ఘర్షణ

మొదటిపేజి తరువాయి

ఈ ఘర్షణలో సౌజన్య ,ఆమె భర్త గాయపడ్డారు. సౌజన్య తనపై అవమానాలు చేయడంతో పాటు,తన భర్తపై హింసకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తంచేశారు.సమావేశంలో భాగంగా, పంచాయతీకి సంబంధించి పాత లెక్కలు,నిధుల చెల్లింపులపై వివాదాలు చర్చకు వచ్చాయి.ఈ నేపథ్యంలో వార్డు మెంబర్ కాని వారు కాగిత విజ్జి, అడబాల నాని వంటి వారు అసభ్యంగా ప్రవర్తించారని సర్పంచ్ ఆరోపించారు. ప్రత్యేకించి సౌజన్య ఎస్సీ మహిళగా ఉండటంతో ఆమెను కావాలనే టార్గెట్ చేశారని ఆమె వాదించారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గాయపడిన సర్పంచ్,ఆమె భర్తకు చికిత్స అందించారు. ఇరువర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

## యండగండిలో పార్శిల్‌లో మృతదేహం

మొదటిపేజి తరువాయి

ఆమెజగనన్న కాలనీలో కట్టుకుంటున్న ఇంటినిమిత్తం సహాయం అందించ బడుతోంది.గతంలోపార్శిల్‌ద్వారా పెయింట్ డబ్బాలు, ఇతర సామాగ్రి అందుకుంది.అయితే గురువారం తనకు పంపిన ఇంటి సామాన్ల ప్యాకింగ్ పెట్టెలో డెడ్ బాడీ,పెట్టెలో ఉన్న లెటర్‌లో కోటి30లక్షలు చెల్లించాలనే డిమాండ్ ఉండటంతో వారు ఉండి పోలీసులను ఆశ్రయించారు. సంఘటన స్థలానికి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, క్లూస్ టీం, ఉండి పోలీసులు చేరుకుని పరిశీలించారు, సుమారు 45 సంవత్సరాల గుర్తుతెలియని మగవ్యక్తిమృతదేహాన్ని గుర్తించారు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

## నిబంధనలు మీరి డ్రైవింగ్ చేస్తే చర్యలు

సూచించారు. జిల్లాలోని అన్ని ప్రదేశాల్లో ఇకనుండి పోలీస్, రవాణా శాఖలు పెద్ద ఎత్తున వాహనతనిఖీలు నిర్వహించా లని ఆదేశించారు.మావుళ్ళమ్మ గుడిప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణ కు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా సూపరిం టెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీంఅస్మి మాట్లాడుతూ రహదారుల భద్రతసమావేశంలో చర్చించిన అంశాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అలాగే హెల్మెట్ లేకపోవడం, త్రిబుల్ రైడింగ్, సెల్ఫోన్ డ్రైవింగ్, స్పీడ్ డ్రైవింగ్ తదితర నిబంధనల కు విరుద్ధంగాగుర్తిస్తే చర్యలు తప్పని హెచ్చరించారు. ఈసమావేశంలో జిల్లారవాణాఅధికారి టి.ఉమా మహేశ్వరరావు,నరసాపురం ఆర్డీవో దాస్‌రాజు,మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్లు కేఎస్ఎన్ ప్రసాద్,ఎం వెంకటేశ్వ రరావు, సిహెచ్ వెంకటరమణ, డిఎస్ఎస్ నాయక్, ఎస్ శ్రీనివాస్, ఏఎమ్ విఐలు ఎస్‌వివి సత్యనారా యణ, ఎఎన్ఎల్ఎస్ లక్ష్మి,ఏఎస్పీ తేజ,జాతీయరహదారి 216ప్రతినిధి, ఆర్అండ్‌బి,పోలీస్, మెడికల్,ఆర్టీసీ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

### పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పి ప్రతాప్ శివకిషోర్ ఆదేశం



**ఏలూరు,మేజర్‌న్యూస్:** ప్రతి శుక్రవారం సిబ్బందిసంక్షేమ కొరకు నిర్వహించే సంక్షేమ దివాస్‌ను పురస్కరించుకొని శుక్రవారం పోలీసు సిబ్బంది శాఖాపరమైన సమస్యలపై ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వ హించారు. జిల్లాలో ఉన్న వివిధ పోలీస్ స్టేషన్‌లు, విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది, ఏ.అర్ సిబ్బంది హోమ్ గార్డ్స్ సమస్యలు గురించి ఎస్పీకి తెలిపారు. జిల్లా ఎస్పీ సిబ్బంది నుండి వినతులను స్వయంగా స్వీకరించి,వారి సమస్యలను సమగ్రంగాఅడిగి తెలిసికొన్నారు. సానుకూలంగా స్పందించి వాటిపై సత్వరమే తగు పరిష్కార చర్యలు తీసుకుంటామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు.ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కారించలని సంబంధిత పోలీస్ ప్రధాన కార్యాలయం అధికారులకు ఎస్పీ ఆదేశించారు.

# నెంబర్ వన్‌గా నూజివీడు ఏరియా ఆసుపత్రి





**– సిటి స్కాన్ ,మౌలిక సదుపాయాలు ఏర్పాటు**

**– 7న కొత్త భవనం ప్రారంభం – మంత్రి కొలుసు పార్థసారథి**

**ఏలూరు/నూజివీడు,మేజర్ న్యూస్ :** నూజివీడు ఏరియా ఆసుపత్రికి వచ్చే ఏ ఒక్క రోగి ఇబ్బంది పడకుండా అత్యుత్తమ వైద్య సేవలందించేలా నూజివీడు ఏరియా ఆసుపత్రిని ఏలూరు జిల్లాలోనే నెంబర్ వన్ ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్ధసారథి అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం నూజివీడు ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్ధసారథి మాట్లాడుతూ ఆసుపత్రికి అవసరమైన సిటి స్కాన్ యంత్రాన్ని ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపితే వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో మాట్లాడి మంజూరయ్యేలా చూస్తానని మంత్రి పార్ధసారథి చెప్పారు. నూజివీడు నియోజవర్గ పరిధిలో విస్తృతంగా వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ప్రజల వద్దకే వైద్య సేవలు తీసుకువెళ్లాలన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలో ఆసుపత్రిలో చేసిన చికిత్సలకు 2. 30 కోట్ల రూపాయలు ప్రోత్సాహకాలు కింద అందాయని, మరిన్ని చికిత్సలు చేసినట్లయితే, ఆ పథకం నుండి వచ్చే ప్రోత్సాహకాలతో ఆసుపత్రికి మరిన్ని వైద్య పరికరాలు, వసతులు కల్పించుకోవచ్చన్నారు. వచ్చే సంవత్సరం ఎన్టీఆర్ వైద్య సేవ చికిత్సల ప్రోత్సాహకాల లక్ష్యాన్ని 6 కోట్ల రూపాయలుగా నిర్దేశించుకుని ఎన్టీఆర్ వైద్య సేవ చికిత్సలు పెద్దఎత్తున చేయాలన్నారు. నూజివీడు ఏరియా ఆసుపత్రిలో కొత్త భవనం నిర్మించి 7 నెలలు అయినప్పటికీ ఇంకా వినియోగంలోకి తీసుకురవకపోవడంపై అధికారులను మంత్రి ప్రశ్నించారు. ఫినిషింగ్ పనులు ఉన్నాయని ఈ నెలాఖరు నాటికి ప్రారంభానికి సిద్ధం చేస్తామని అధికారులు తెలియజేయడంతో జనవరి, 7వ తేదీన వైద్య ఆరోగ్య శాఖామంత్రితో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

**– నూజివీడు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ –**ఈ సందర్భంగా నూజివీడు ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా మంత్రి పార్ధసారథి, సభ్యులుగా ఇళయరాజా,ఎం.వెంకట కామేష్, డా.ఝాన్సీరాణి, సబ్ కలెక్టర్ సమరం రాజ్, డా.నాదెండ్ల శ్రీకాంత్, గొల్ల దుర్గ దేవి, మెంబెర్ కన్వీనర్‌గా డా.నరేంద్ర సింగ్ ప్రమాణ స్వీకారం చేశారు.అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్దిదారులకు మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయాధికారి డా.పాల్ సతీష్,ఏపి ఎంఐడిసిఈ కె.నాగార్జున, డా.శ్రీనివాసరావు, మునిసిపల్ కమీషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి, ప్రభృతులు పాల్గొన్నారు.

# ఎల్ఐసిని రక్షించండి : ఎల్ఐసి ఏఓఐ పిలుపు

**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఎల్ఐసి 21వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈరోజు ఏలూరు బ్రాంచ్ ఆఫీస్ దగ్గర జెండా ఆవిష్కరణ జరిగింది. బ్రాంచ్ కన్వీనర్ కోడె రాంబాబు, యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్ఐసి ఏఓఐ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి రవి కిషోర్ మాట్లాడుతూ ఎల్ఐసి సంస్థను నిర్వీర్యం చేయడానికి ఐఆర్‌డిఏ తీసుకున్న ప్రతిపాదనలను వ్యతిరేకించాలని చలో పార్లమెంట్ ధర్నాకు ఏజెంట్లు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.ఎల్ఐసి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుని పై ఉందని ఈ పోరాటానికి ఏజెంట్లు అందరూ నాయకత్వం వహించాలని కోరారు. పోరాడితేనే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని, కేంద్ర కమిటీ ఇచ్చే ప్రతి పిలుపుని బ్రాంచ్ స్థాయిలో అమలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సెంటర్ కమిటీ నాయకులు డివి రామకృష్ణ, జోనల్ నాయకులు బి.రామ్మోహన్రావు, డివిజన్ నాయకులు, బ్రాంచ్ నాయకులు పి.సాంబ



శివరావు వైయస్ కనకారావు, తాళం సురేషు కట్టా సుబ్బారావు, జె ఎస్ ఆర్ చంద్రశేఖర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సుధాకర్, బ్రాంచ్ ఏబీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అమిత్ షా రాజీనామా చేయాలి




**– సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి హేమ శంకర్**

**ఏలూరు,మేజర్‌న్యూస్:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో ఏలూరు పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ ఆశయాలను సాధిస్తామని జయహొ అంబేద్కర్ అని అమిత్ షా రాజీనామా చేయాలని అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా క్షమాపణలు చెప్పాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ భారత దేశ రాజ్యాంగ నిర్మాత, దేశంలో అసమానతలు తొలగించడానికి తన జీవితకాలమంతా కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను అవమనపరిచేలా రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా వ్యాఖ్యలను భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని తెలియజేశారు. భారత రాజ్యాంగం ద్వారా హెూం మంత్రి పదవిలో కూర్చున్న అమిత్ షా తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్,జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబి,జిల్లా సమితి సభ్యులు భజంత్రీ శ్రీనివాసరావు ఏలూరు నగర కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల లక్ష్మీ ఇందిర,మావూరి విజయ, తెర్లాపు శ్రీను,ఎం.ఏ.హకీమ్, కొల్లూరి సుధారాణి,ఉప్పులూరి లక్ష్మి, భవాని అక్కిరెడ్డి వరలక్ష్మి, అబ్దుల్ రషీద్, మూర్తి, కే.భాస్కరరావు, ఆర్.సోమేశ్వరరావు, జి.ఈశ్వరరావు, ఏ.అప్పారావు, ఆలూరి రమేష్,జిజ్జువరపు సురేంద్ర, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ఎంఇఓల నియామకం





**భీమడోలు,మేజర్ న్యూస్ :** నిడమర్రు మండల విద్యాధికారులు నెంబర్ ఒకటి, రెండుగా భీమడోలులో పనిచేస్తున్న ఈదుపల్లి శ్రీనివాసరావు ,ఎ.వి.ఎస్.ఎన్. భాస్కర కుమార్ నియమితులయ్యారు. వీరు భీమడోలుతో పాటు నిడమర్రు మండలం విద్యాధికారులుగా అదనపు బాధ్యతలను స్వీకరించమన్నారు. ఈ నేపథ్యంలో ఇంతవరకు భీమడోలుతో పాటు ఉంగుటూరు నెంబర్ 2 విద్యాధికారిగా పనిచేస్తున్న భాస్కర్ కుమార్ ఆ బాధ్యతల నుంచి తప్పుకోనున్నారు. గతంలో భీమడోలతో పాటు ద్వారకాతిరుమల మండలం నెంబర్ ఒకటి విద్యాధికారిగా పనిచేసిన శ్రీనివాసరావు ఇప్పటికే ద్వారకాతిరుమల నుంచి రిలీవ్ అయ్యారు. ప్రస్తుతం వీరు ఇరువురు నిడమర్రు మండల విద్యాధికారులుగా శనివారం బాధ్యతలను స్వీకరించనున్నారు.

## నేడు ద్వారకా తిరుమల సబ్ స్టేషన్‌లో విద్యుత్ నిలిపివేత



**ద్వారకతిరుమల,మేజర్ న్యూస్:** ద్వారకా తిరుమల సబ్ స్టేషన్ లో విద్యుత్ వినియోగధారులకు విజ్ఞప్తి శనివారం 21 తేదీన ద్వారకాతిరుమల 33/ 11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్లు నరుకుట కార్యక్రమం వలన శనివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 వరకు కరెంట్‌కి అంతరాయం కలుగును.దీని వల్లద్వారకా తిరుమల,కొమ్ముగూడెం మరియు లక్ష్మీపురం గ్రామలకు కరెంట్ సరఫరా అంతరాయం కలుగును అని తెలియజేయుచున్నాము.కనుక వినియోగధారులు సహకరించగలరు.ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు.

## హెూంశాఖ మంత్రి అమిత్ షాను తక్షణమే బర్త్ రఫ్ చేయాలి

**– ఎస్సీ,ఎస్టీ కుల సంఘాల జేఏసీ డిమాండ్**



**ఏలూరు,మేజర్‌న్యూస్:**రాజ్యసభలో కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా అంబేడ్కర్‌ని అవహేళన చేస్తూ మాట్లాడటాన్ని ఖండిస్తూ శుక్రవారం స్థానిక పాత బస్ స్టాండ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ కుల సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్‌ని అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షా ను తక్షణమే మంత్రి వర్గం నుండి బర్త్ రఫ్ చేయాలని,భారత ప్రజలకు క్షమాపణలు చెప్పాలని భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో చాగంటి సంజీవ్ ఐఆర్ఎస్, పల్లెం ప్రసాద్, నేతల రమేష్ బాబు,మేతర అజయ్ బాబు,దాసరి నాగేంద్ర కుమార్, కాపుదాసి రవి, ఎరికిపాటి విజయ్,దాసరి శ్యామ్,మెండెం ఆనంద్,నూకపెయ్యి కార్తీక్,చింతా మహాలక్ష్మణుడు,కర్నకోటి దిలీప్, పెరియార్ పూలే అంబేద్కర్,దాసి వెంకటేశ్వర్లు,కుర్మారాజు,కర్రే అంబేద్కర్, గేరా అబ్రహం,కంచర్ల విజయ్ శేఖర్, గుడిపూడి రమేష్ బాబు,కాగిత డేవిడ్ రాజు,ఆంధ్రాబ్యాంక్ నాగరాజు,చొప్పల సాయిబాబు, వినీత్, రాగోలు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలు ఐక్యంగా ఉండాలి





**– సన్మాన సభలో మంత్రులు సవిత,సత్య కుమార్,సుభాష్,శ్రీనివాస్**

**విజయవాడ/ ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఏపీ బీసీ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ సారథ్యంలో గురువారం రాత్రి విజయవాడ క్లబ్ నందు రాష్ట్ర బీసీ మంత్రులకు సన్మాన కార్యక్రమం జరిగింది. రాష్ట్ర వైద్యశాఖ వై,సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ బీసీలందరూ ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు అని, మహాత్మ జ్యోతిబా కలలు కన్న సమాజాన్ని నిర్మించవచ్చని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తన రాజ్యాంగం ద్వారా ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించే లాగా రాజ్యాంగాన్ని ఏర్పాటు చేశారని తద్వారా బీసీలకు వారి హక్కులు పొందడానికి వీలు కలిగిందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ని కొనియాడారు, అమరావతిలో మహాత్మ జ్యోతిబా, సావిత్రిబాయి పూలే స్మారక వనాన్ని ఏర్పాటు చేసే విధంగా, మహాత్మ జ్యోతిబాపూలే జయంతి ఏప్రిల్ 11వ తారీఖున సెలవు దినంగా ప్రకటించడానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత మాట్లాడుతూ మొదటిసారిగా బీసీలకు రాజ్యాధికారం అందించిన వ్యక్తి డాక్టర్ నందమూరి తారక రామారావుని అలాగే నేటి సిఎం నారా చంద్రబాబునాయుడు ద్వారా తామంతా మంత్రులుగా ఏర్పాటు చేయబడ్డామని టిడిపికి,ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్మిక శాఖ మంత్రి వి.సుభాష్ మాట్లాడుతూ బీసీ అని చెప్పుకోవాడానికి భయపడే స్థాయి నుంచి బీసీ అని గర్వంగా చెప్పుకునే స్థాయికి నిలబెట్టినటువంటి బీసీ సమాజానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు,ఎంఎస్ఎంఈ,సెర్ఫ్‌శాఖల మంత్రి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ ఎంప్లాయిస్ సమస్యలు,మెమోరాండంలోని విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ తామని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో ఏపీ బీసీ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.పి.ఆర్. విఠల్ కుమార్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబాపూలే పర్వదినాన్ని సెలవు దినంగా ప్రకటించాలని,ప్రతి జిల్లాలోనూ మహాత్మ జ్యోతిబాపూలే స్మారకవనాన్ని నిర్మించాలని, అలాగే బీసీ భవన్‌లు ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాలని,అదేవిధంగా బీసీ ఎంప్లాయిస్‌కి ప్రతి జిల్లాలో ఆఫీస్ ఏర్పాటు చేసుకోవడానికి స్థలాన్ని కేటాయించాలని మంత్రిని కోరారు.

ఈ కార్యక్రమంలో బీసీ ఎంప్లాయిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి.వీరబ్రహ్మం,బిసి ఎంప్లాయిస్ రాష్ట్ర కన్వీనర్ పామర్తి యేసు రాజు,బీసీ ఎంప్లాయిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పి భూషన్ రావు ,పి శ్రీధర్ ,బిసి ఎంప్లాయిస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మీ కేదారేశ్వర రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఎం రంగనాయకులు, శంకర్ ప్రసాద్ మొదలగు రాష్ట్ర నాయకులు,రాష్ట్ర సభ్యులు వీరితోపాటు వివిధ జిల్లాల అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు అనేకమంది బీసీ ఎంప్లాయిస్ పాల్గొన్నారు.

## కరెంట్ ఆదా చేసి భావితరాలకు భరోసా ఇవ్వాలి : ఎమ్మెల్యే నాయకర్

**నరసాపురం, మేజర్ న్యూస్:** పట్టణంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు సందర్భంగా నర్సాపురం విద్యుత్ శాఖ ఈఈ కే మధు కుమార్ ఆధ్వర్యంలో నర్సాపురం సబ్ డివిజన్ విద్యుత్ శాఖ ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్లో జరిగిన సభలోఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ కరెంట్ ఆదా చేసి భావితరాలకు భరోసా ఇవ్వాలని అన్నారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు, నియోజవర్గ జనసేన టిడిపి బిజెపి నాయకులు కార్యకర్తలు జనసేన వీర మహిళ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రంలోనే రెండవ తల్లిపాల బ్యాంకు భీమవరంలో ఏర్పాటు

**– జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**



**భీమవరం,మేజర్ న్యూస్ :** తల్లిపాలు ఇవ్వడం ద్వారా ప్రయోజనాలను ప్రతి ఒక్క తల్లి అవగాహన కలిగి, ఆచరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం భీమవరం ప్రభుత్వ ప్రాంతీయ ఏరియా ఆసుపత్రి నందు నాగార్జున కన్స్ట్రక్షన్ కంపెనీ దాతృత్వంతో సుశేణా హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధాత్రి తల్లిపాల బ్యాంకును, బాలింతల నిర్వహణ కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈసందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మన భీమవరం నందు తల్లిపాల బ్యాంకునుఏర్పాటు చేసుకోవడం ఎంతో సంతోషించదగిన విషయం అన్నారు. రాష్ట్రంలోనే మన భీమవరంలో రెండవ తల్లిపాల బ్యాంకును ప్రారంభించడం జరిగిందని, మొదటి తల్లిపాల బ్యాంకు కాకినాడలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వివిధ అధ్యయనాల ప్రకారం బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ప్రారంభించినట్లయితే నవజాత శిశువులకు ప్రాణాపాయమైన అంటువ్యాధులనుంచి రక్షణ, 6 నెలల కాలము కేవలం తల్లిపాలు ఇవ్వడం వలన సంవత్సరంలోపు పిల్లల మరణాలకు ప్రధాన కారణమైన నీళ్ళ విరేచనాలు,శ్వాసకోశ వ్యాధుల నుండి రక్షణ కలుగుతుందన్నారు.

హెచ్.ఐ.వి. సోకిన తల్లులు, హెచ్.ఐ.వి. మందులు వాడుకుంటూ పిల్లలకు కూడా హెచ్.ఐ.వి. మందులు ఇప్పిస్తూ మొదటి 6 నెలల కాలం కేవలం తల్లిపాలు ఇచ్చినట్లయితే తల్లి నుంచి బిడ్డకు హెచ్.ఐ.వి. సంక్రమణ కూడా తగ్గుతుందన్నారు. నాగార్జున కన్స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్.సి.సి) చైర్మన్ డాక్టర్ ఎ.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తల్లిపాలను గుర్తించి మా సంస్థ సిఎస్ ఆర్ నిధులతో తల్లిపాల బ్యాంకు ఏర్పాటుకు సహకరించడం జరిగిందన్నారు. సుశేణా హెల్త్ ఫౌండేషన్ డైరెక్టర్ కాశీనాథ లక్కరాజు మాట్లాడుతూ తల్లులకు సమగ్ర లాక్టేషన్ మద్దతు అందించడానికి, శిశువులకు అత్యుత్తమ పోషణను నిర్ధారించడానికై చేయబడిందన్నారు. తొలుత తల్లిపాల బ్యాంకు ప్రారంభానికి ముందు పూజ నిర్వహించి,బాలింతల నిర్వహణ కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం మిషనరీ పనితీరు వివరాలను ధాత్రి లాక్టేషన్ మేనేజ్మెంట్ యూనిట్ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి తల్లిపాల సేకరణ,నిల్వ ఎక్విప్మెంట్ ను జిల్లా జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యురాలు తోట సీతా రామలక్ష్మి, డిసిహెచ్ఎస్ డాపి.సూర్యనారాయణ, భీమవరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.మాధవి కళ్యాణి, నాగార్జున కన్స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ ఎ.దుర్గాప్రసాద్, సుశేణా హెల్త్ ఫౌండేషన్ డైరెక్టర్ కాశీనాథ లక్కరాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాలో 571 మందికి ఉద్యోగాలు



**నూజివీడు,మేజర్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్,జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో ఎస్.ఎ.సి ఆడిటోరియం ట్రిపుల్ ఐటి క్యాంపస్ ఏలూరు జిల్లా నూజివీడు నందు శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు 1256 మంది యువత హాజరు అయి 571 మంది వివిధ కొలువులకు ఎంపిక చేసినట్లు ఏలూరు జిల్లా నైపుణ్యభివృది సంస్థ అధికారి ఎన్. జితేంద్ర బాబు తెలిపారు. ఈ జాబ్ మేళా లో 34 కంపెనీల ప్రతి నిధులు పాల్గొనడం జరిగిందన్నారు. కార్యక్రమ ంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఏలూరు జిల్లా డి.ఎస్.పి, నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్,డిఆర్డిఎ పిడి ఆర్. విజయరాజు, ట్రిపుల్ ఐటి డైరెక్టర్ అమరేంద్ర కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## ఇంతవరకు 254 గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు

**– ప్రజల నుంచి 2,729 అర్జీలు స్వీకరణ : జెసి**



**ఏలూరు,డిసెంబర్,20:** ఏలూరు జిల్లాలో 28 మండలాల్లో మొత్తం 665 రెవిన్యూ గ్రామాలుండగా ఇంతవరకు 254 గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని జాయింట్ కలెక్టర్ పి .ధాత్రిరెడ్డి తెలిపారు. జిల్లాలో శుక్రవారం నిర్వహించిన 31 రెవిన్యూ సదస్సుల్లో 1456 మంది పాల్గొని ఆయా సమస్యలపై 307 అర్జీలను అందజేయగా వాటిలో అప్పటికప్పుడే 77 అర్జీలు పరిష్కరించడం జరిగిందన్నారు. రెవిన్యూ సదస్సులలో అందిన విజ్ఞప్తులను 45 రోజులలోగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు నిర్వహించిన 254 గ్రామ రెవిన్యూ సదస్సులకు 11,922 మంది హాజరై 2,729 అర్జీలు అందజేయగా ఇప్పటికే 521 అర్జీలు పరిష్కరింపబడ్డాయన్నారు. రెవిన్యూ సదస్సులు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతీ మండలానికి జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించడం జరిగిందన్నారు. జనవరి 8వ తేదీ వరకు ఆయా గ్రామల్లో నిర్వహించే రెవిన్యూ సదస్సులలో ప్రజలు పాల్గొని తమ భూములకు సంబందించిన సమస్యలను తెలియజేసి పరిష్కారం పొందాలన్నారు.

## జనసేన పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి



**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ విస్తరణకు నిరంతరం కృషి చేస్తానని జనసేన పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా తనకిచ్చిన గౌరవాన్ని నిలబెట్టుకుంటానని గడ్డమణుగు రవి కుమార్ పేర్కొన్నారు.

శుక్రవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గ అధికార ప్రతినిధిగా ప్రకటించి నందుకు పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజుకి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. నియోజకవ ర్గంలో అధికార ప్రతినిధిగా నా కర్తవ్యాన్ని నేను నెరవేరుస్తానని, జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. నియోజ కవర్గంతో పాటు రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాలకు పని చేస్తూ పార్టీ నలుదిశల విస్తరించేలా చేసేందుకు తాను అన్నివేళల ముందు ఉంటానని అన్నారు.

ప్రతి కార్యకర్తను సైనికుడిగా భావించి రాబోయే రోజుల్లో జనసేన జెండాను ప్రతిపల్లెలోనూ ఎగరవేసేలా చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. తనకు సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో వైద్యులు పని చేయాలి

**- జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి**



**భీమవరం,మేజర్‌న్యూస్ :** భీమవరం ఏరియా హాస్పిటల్‌లోని పలు విభాగాలను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ప్రసూతి వార్డును సందర్శించి ఆపరేషన్ చేయించుకున్న బాలింతలను పలకరిస్తూ ప్రతిరోజు మెనూ ప్రకారం ఆహార అందిస్తున్నారా, వైద్య సేవలు ఎలా ఉన్నాయి, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.శీతాకాలం కనుక ఆపరేషన్ చేయించుకున్న వారికి మరింత జాగ్రత్తగా వైద్య సహాయం అందించాలని వైద్యులకు సూచించారు. వైద్యులు సకాలంలో వైద్యం అందిస్తున్నారా లేదా, ఉదయాన్నే ఏ డాక్టర్ వచ్చారు అని అడిగి తెలుసుకున్నారు. అలాగే వైద్య సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు, బాలింతలలు బిడ్డకు ఏ విధంగా పాలు ఇవ్వాలో ప్రతి ఒక్క బాలింతకు వైద్య సిబ్బంది తెలుపుతున్నారా లేదని బాలింతలను అడిగారు. సౌకర్యాలు ఎలా ఉన్నాయి ఆరా తీశారు. బాగా చూస్తున్నారని, సౌకర్యాలు బాగున్నాయి బాలింతల సమాధానం ఇవ్వడంతో జెసి సంతృప్తిని వ్యక్తం చేశారు. నవజాత శిశువును జిల్లా జాయింట్ కలెక్టర్ ఎత్తుకొని పుట్టినప్పుడు బిడ్డ ఎంత బరువు ఉంది, ఇప్పుడు ఎంత ఉంది అని అడిగి తెలుసుకున్నారు. తల్లిపాలు కన్నా శ్రేష్టమైనవి ఏమి లేవని బిడ్డ పుట్టిన ఒక గంటలోపుగా తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలన్నారు.అప్పుడే ఆ బిడ్డ ఆరోగ్యంతో పాటు, తెలివి తేటలు వస్తాయని బాలింతలకు సూచించారు. బిడ్డ పుట్టిన మొదటి గంట నుండి ఒక సంవత్సరం వరకు తల్లిపాలు మాత్రమే పట్టాలని వీటి ద్వారా శిశువుకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని బాలింతలకు తెలిపారు, ఆసుపత్రి తనిఖీ సందర్భంలో డిసిహెచ్ఎస్ డా.పి.సూర్యనారాయణ, హాస్పటల్ సూపరింటెండెంట్ బి.మాధవి కళ్యాణి, సిబ్బంది, తదితరులు ఉన్నారు .

# సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ధర్మరాజు



**భీమడోలు,మేజర్ న్యూస్ :** వివిధ ఆరోగ్య సమస్యల కారణంగా చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నియోజకవర్గ పరిధిలోని పలువురుకి సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే ధర్మరాజు శుక్రవారం సాయంత్రం నారాయణపురం లోని ఆయన కార్యాలయంలో అందజేసారు. నియోజకవర్గ పరిధిలోని భీమడోలు, నిడమర్రు, ఉంగుటూరు, గణపవరం మండలాలకు చెందిన 12మంది లబ్దిదారులకు 8లక్షల 39వేల రూపాయల విలువ కలిగిన చెక్కులను ఎమ్మెల్యే అందజేసారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ అనారోగ్యం నిమిత్తం వైద్యం చేయించుకొని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న బాధితులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా లబ్దిచేకూరే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# హైందవ శంఖారావం సభను విజయవంతం చేయండి

**- ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్**



**ఏలూరు,మేజర్ న్యూస్ :** హిందూ దేవాలయాల స్వయం ప్రతిపత్తి కోరుతూ విశ్వ హిందూ పరిషత్ (వీహెచపీ) ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో చేపట్టిన హైందవ శంఖారావం భారీ బహిరంగ సభకు భారీగా హిందువులు తరలివచ్చి జయప్రదం చేయాలి అని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏలూరు అశోక్ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ ను హైందవ శంఖారావం జిల్లా కో కన్వీనర్ మేడిశెట్టి పాములు, జిల్లా నిధి సేకరణ ప్రముఖ్ కట్నేని కృష్ణ ప్రసాద్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు సురేష్ కుమార్, బిజెపి జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్ కలసి హైందవ శంఖారావం సభ ఆహ్వాన పత్రికను అందజేయడంతోపాటు హైందవ శంఖారావం సభ ప్రధాన ఉద్దేశాలను వివరించి కరపత్రాలను అందించారు. హైందవ శంఖారావం సభకు మద్దతు తెలుపుతూ రోషన్ కుమార్ ఆన్లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ జనవరి 5న గన్నవరంలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావం సభకు దాని తప్పనిసరిగా హాజరు అవుతానని, చింతలపూడి నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో హిందువులు సభకు హాజరయ్యేలా తన వంతు కృషి చేస్తానని విశ్వహిందూ పరిషత్ నాయకులకు హామీ ఇచ్చారు.

# ఆర్టీసీ డోర్ డెలివరీ ప్రారంభించిన ప్రభుత్వ విప్ నాయకర్




**నరసాపురం,మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థఆధ్వర్యంలో శుక్రవారం కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ప్రారంభించి మొదటి డెలివరీ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ద్వారా చేపడుతున్న ఈ సేవలు వేగవంతముగా జరిగేలాగా చర్యలు చేపట్టాలన్నారు.

ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి, డిపో బుకింగ్ ఇంచార్జ వర్మ కలిసి పాల్గొని, డోర్ డెలివరీ మాసోత్సవాల ప్రధాన లక్ష్యం, ప్రయోజనాలు, ప్రజలకి అందించే సౌకర్యాలను వివరించారు. ఈ మాసోత్సవాల ద్వారా ఎపి ఎస్ఆర్‌టిసి కార్గో సేవలను మరింత ప్రజలకి దగ్గరచేసి, వేగవంతమైన మరియు సౌకర్యవంతమైన సేవలందించేందుకు కట్టుబడి ఉందని ప్రకటించారు.

# సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మద్దిపాటి





**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** ఆపదలో ఉన్న పేదవారికి సీఎం సహాయనిధి అండగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే మద్దిపాడు వెంకటరాజు అన్నారు.శుక్రవారం ఉదయం మండలంలోని కొత్త గూడెం, జి కొత్తపల్లి, దేవినేని వారి గూడెం, తిరుమల పాలెం, రామన్నగూడెం, గ్రామాలకు చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ4,84,385లు చెక్కులను అందజేశారు. ఐ యస్ జగన్నాధపురం లోని సుందరగిరిపై స్వయం వ్యక్తిగా కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.ఈ క్రమంలో టిడిపి మండల అధ్యక్షులు లంకా సత్యనారాయణ, జనసేన పార్టీ మండల అధ్యక్షులు దాకారపు నరసింహమూర్తి, ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజకీయాలకతీతంగా సిఎం సహాయ నిధి మంజూరుకు కృషి

**- శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు**

**భీమడోలు,మేజర్‌న్యూస్ :** రాజకీయాలు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు కృషిచేస్తానని, శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు హామీ ఇచ్చారు. శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భీమడోలు మండలానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధిగా మంజూరైన రూ.2,16,775 పత్రాలను అందజేశారు.దీనిలో భాగంగా పొలసానిపల్లికి చెందిన షేక్ సమీమున్నీసా బేగంకు మంజూరైన రూ.60 వేల మంజూరు పత్రాలను, పొందూరి రమేష్‌కు మంజూరైన రూ.81,392 మంజూరు పత్రాలను ఆగ్రామ సర్పంచ్ దంపతులు షేక్ రహీమా బేగం హసేన, పారిశ్రామి కవేత్తలు షేక్ హసేనతో పాటు షేక్ ఖాజా ఇతర ప్రముఖులతో కలిసి శాసనసభ్యులు సంయుక్తంగా అందజేశారు.

ఇదే గ్రామానికి చెందిన పొందూరి రమేష్‌కు మంజూరైన లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇదేవిధంగా గుండుగొలనుకు చెందిన టి.దుర్గా ప్రసాద్‌కు మంజూరైన రూ.35,383 పత్రాలు,పూళ్ళకు చెందిన వై.సరస్వతికి మంజూరైన రూ.40 40 వేల పత్రాలను సంబంధీకులకు ఆయా గ్రామాలకు చెందిన కూటమి నాయకుల ద్వారా అందజేశారు.

# 365 బీ.బీ. రహదారి బాధితులకు నష్టపరిహారం పెంచండి

**- ఎమ్మెల్యే బాలరాజుకు వినతి**

**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ :** మండలంలోనితాటియాకులగూడెం నుండి పోలవరం వరకు నిర్మించనున్న 365 బీబీ జాతీయ రహదారిలో ఇళ్ళు స్థలాలు వ్యవసాయ భూములు కోల్పోతున్న బాధితులకు ఇచ్చే నష్టపరిహారాన్ని పెంచాలని కోరుతూ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కి బాధితులు జీలుగులలోని పార్టీ కార్యాలయం వద్ద వినతి పత్రాన్ని అందించారు. తమకు ఇచ్చే పరిహారం న్యాయంగా ఇస్తే సంతోషంగా స్వీకరిస్తాం అని అలా కాకుండా లక్షల రూపాయల విలువైన ఆస్తులకు వేలల్లో పరిహారం ప్రకటించడం దారుణమని అన్నారు. జీలుగుమిల్లిలోనే రెండు రకాలుగా విభజించి పరిహారం ప్రకటించినట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ఉన్న స్థలాలు షాపులను భూములను పోగొట్టుకుంటు న్నామని మరోచోట కొనుగోలు చేసే విధంగా పరిహారం అందిస్తే తమను ఆదుకున్నట్లు అవుతుందని వివరించారు. దీనిపై స్పందించిన చిర్రి బాలరాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు బాధితులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనసేన అధికార



ప్రతినిధి గడ్డ మణుగు రవికుమార్, బాధితులు కొండపల్లి దుర్గాప్రసాద్, కోరుకొండ సూరిబాబు, మాతంశెట్టి కిషోర్, కక్కిరాల చక్రధర్, యాండ్రా రఘుబాబు, అమ్మజూరి సత్యనారాయణ, కక్కి రాల రాము, సాదు చెన్నారావు, చిట్లూరి సూర్యనారాయణ ఉన్నారు.

# ఛాంబర్స్‌లో రసాయన శాస్త్రంలో ఉద్యోగ అవకాశాలపై అవగాహన



పాలకొల్లు,మేజర్‌న్యూస్: స్థానిక బిఆర్ఆర్ అండ్ జికెఆర్ చాంబర్స్ డిగ్రీ పీజీ కళాశాలలో శుక్రవారం రసాయన శాస్త్ర విభాగంలో ఉద్యోగాల అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ బి. జగన్మోహన్ రెడ్డి, చైర్మన్, బి ఓ ఎస్, రసాయన శాస్త్ర విభాగ పతి,ఆదికవి నన్నయ యూనివర్సిటీ విచ్చేశారు. ఛాంబర్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి. వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిని సదస్సుకు పరిచయం చేస్తూ నేటి కాలంలో అబ్బాయిలు అమ్మాయిలు కూడా ఉద్యోగాలు చేసే విధంగా తగిన నైపుణ్యాలను కలిగి ఉండాలని తెలియజేశారు.

ముఖ్య అతిథి మాట్లాడుతూ రసాయన శాస్త్ర విభాగంలో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అందుకు అనుగుణంగా కమ్యూనికేషన్ స్కిల్స్, పాజిటివ్ యాటిట్యూడ్,హార్డ్‌వర్క్, పర్సనాలిటీ డెవలప్మెంట్ వంటి నైపుణ్యాలను పెంపొందించుకోవడం వలన ఫార్మా కంపెనీలలో, ఐటి కంపెనీలలో, వంటి వాటిలోనే కాకుండా బార్క్, ఇస్రో వంటి ప్రసిద్ధమైన రీసెర్చ్ సెంటర్లలో సైంటిస్టులు, జూనియర్ లెక్చరర్స్ మొదలైనటువంటి ఉద్యోగాలు ఈ రసాయన శాస్త్రం అధ్యయనం చేయడం ద్వారా పొందవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సిహెచ్.మురళీకృష్ణ, రసాయన శాస్త్ర ఇంచార్జ్ యు. జానకి రామయ్య, వి.శేఖర్ బాబు, ఏ.స్పందన, పి.తనుజ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# 26న సిపిఐ 100వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించాలి




ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్: కష్టజీవుల శ్రమజీవుల అభ్యున్నతి కోసం ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100వ వ్యవస్థాపక దినోత్సవం ఈ నెల 26న వాడవాడల ఘనంగా నిర్వహించాలని సిపిఐ శ్రేణులకు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వర రావు పిలుపునిచ్చారు. శుక్రవారం ద్వారకా తిరుమలలో సిపిఐ ద్వారకాతిరుమల మండల సమితి సమావేశం మాండ్రు బాలరాజు అధ్యక్షతన జరిగింది. మండలంలో సెప్టెంబర్ 20న మహాసభ జరిగిన నాటి నుండి నేటి వరకు నిర్వహించిన కార్యక్రమాల రిపోర్టును సిపిఐ మండల కార్యదర్శి గోలిమే బాల యేసు వివరించారు. సమావేశానికి అతిథిగా పాల్గొన్న బండి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ గా 99 సంవత్సరాలుగా దేశంలో దున్నేవాడికే భూమి కావాలని అనేక ఉద్యమాలు నిర్వహించి లక్షలాది ఎకరాలు భూములను పేదలకు సాధించిన ఘనత సిపిఐ కి ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను నష్టపరుస్తుందని ఆయన విమర్శించారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, రైతాంగ వ్యతిరేక విధానాలను ప్రజానీకానికి పార్టీ పుట్టినరోజు సందర్భంగా వివరించాలని ఆయన పార్టీ కార్యకర్తలను కోరారు. సమావేశంలో సిపిఐ మండల సమితి సభ్యులు గంజి పెద్దిరాజు, ఎం రమేష్, పి ప్రభావతి, ఎం రవి, జి నాగలక్ష్మి పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులో 9 వినతులు




భీమడోలు,మేజర్ న్యూస్ : చెట్టున్న పాడు, మల్లవరం రెవెన్యూ గ్రామాలలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సందర్భంగా తొమ్మిది వినతులు వచ్చినట్లు భీమడోలు తహసిల్దార్ బి.రమాదేవి తెలిపారు. దీనిలో భాగంగా పట్టాదారుల పాస్ పుస్తకాలకు చెందిన రెండు, మ్యూటేషన్‌కు చెందిన మూడు దరఖాస్తులతో పాటు, సర్వేకు సంబంధించి నాలుగు వినతులు వచ్చాయన్నారు. రెండవ విడత రీ సర్వే కోసం పైలట్ గ్రామంగా ఎన్నికైన మండలంలోని సూరప్ప గూడెం గ్రామంలో శనివారం అవగాహన ర్యాలీ, గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసిల్దార్ తెలిపారు.

కార్యక్రమంలో ఆర్ ఐ కిరణ్ కుమారి, సర్వేయర్ ధర్మారావు, భీమడోలు ఎస్సై సుధాకర్, గ్రామ రెవెన్యూ అధికారులు దీనరాజు, శంకర్ పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెటింగ్ ముసాయిదాను కేంద్రం ఉపసంహరించాలి

**– 23న జరిగే నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయండి**

ఏలూరు,మేజర్ న్యూస్ : వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం ముసాయిదా ఫ్రేమ్ వర్క్‌ను వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించాలని, రైతుల ప్రయోజనాలు బలిపెట్టి కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టే చర్యలు ఆపాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏలూరు పవర్ పేట లోని అన్నే భవనంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం నిర్వహించారు. ఈనెల 23న సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపు మేరకు వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం ముసాయిదా పత్రాలను దగ్ధం చేసి నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సమావేశం నిర్ణయించింది. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బి.కే.ఎం.యు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన రావు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివ నాగరాణి జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తిరిగి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 246



ప్రకారం వ్యవసాయ మార్కెటింగ్ రాష్ట్ర పరిధిలో ఉందన్నారు. రాష్ట్రాల హక్కులను హరించి వేయడం, రైతులకు మద్దతుగా ఉన్న వ్యవసాయ మార్కెట్లను రద్దు చేయడం కేంద్ర ముసాయిదా ఉద్దేశంగా ఉందన్నారు. రైతులు ఆత్మహత్యలు, రుణ భారం మరింత పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తామా ముత్యాలమ్మ,గుడెల్లి వెంకట రావు, అందుగుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సబ్ జైలును సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



నర్సాపురం,మేజర్ న్యూస్: వివిధ కేసులలో 70 సంవత్సరాల పై బడి, ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతున్న జైల్ నిందితుల వివరాలను తెలుసుకొనేందుకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ ఉప కారాగారానికి వచ్చారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో వృద్ధాప్యంలో ఉన్న,అనారోగ్యంతో బాధపడుతున్న నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న వైద్య సదుపాయాలు తదితర విషయాలను జైల్ సూపరింటెండెంట్ ను,జైల్ విజిటింగ్ డాక్టర్ జె.గణేష్‌ను అడిగి తెలుసుకున్నారు. జైల్ న్యాయ సలహాదారుల ద్వారా జైల్ ముద్దాయిలు వారి కేసు వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. అనంతరం వంటశాల,ఆహార పదార్థాలను, స్టోర్ రూం ను,తనిఖీ చేశారు. ఉప కారాగారం పర్యవేక్షణాధికారి టి. అప్పారావు, జైల్ సిబ్బంది, ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ న్యాయవాది ఎన్. ఆనంద బాబు,పి.ఎల్.వి.ఎన్.రాంబాబు, లీగల్ ఎయిడ్ కౌన్సెల్ కె.చిట్టి పద్మజ జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కోటపాడు,చీపురుగూడెం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు




చాట్రాయి,మేజర్ న్యూస్: మండలంలో శుక్రవారం కోటపాడు,చీపురుగూడెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సు లు. నిర్వహించారు. గ్రామాల రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుండి 3 ఆర్జీలు వచ్చాయని తాసిల్దార్ దాసరి ప్రశాంతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ కార్యదర్శి సర్వేయర్ లక్ష్మీనారాయణ. పలు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పన్నులు వసూళ్ల స్పెషల్ డ్రైవ్ పాల్గొన్న కమీషనర్ అంజయ్య



నరసాపురం,మేజర్ న్యూస్: ఇంటి పన్నులు ఖాళీ స్థలం పన్నులు కుళాయి పన్నుల కలెక్షన్ డ్రైవ్‌లో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరమునకు సంబందించి పురపాలక సంఘమునకు చెల్లించవలసిన బకాయిలను వెంటనే చెల్లించాలనిమున్సిపల్ కమీషనర్ యం అంజయ్య అన్నారు. శుక్రవారం పన్నుల వసూళ్లకు సంబంధించి పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పన్నులను మీకు దగ్గరలో ఉన్న మీసేవ కేంద్రంలోగాని %ఎంఎు.ఖజా.గ్రశీజ.అఱ% వెబ్ సైట్ నందు గాని, మున్సిపల్ ఆఫీసు నందు గాని చెల్లించవలెను అని అన్నారు. మున్సిపల్ ఆఫీసు నందు ప్రతి దినము ఉదయం గం.10 నుండి సాయంత్రం గం 5 గం.ల వరకు పన్నులను స్పెషల్ కౌంటర్లలో కట్టించుకోబడునున్నారు.కావున ట్యాక్స్ చెల్లింపుదారులు పన్నుల చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ కోరారు. ఈకార్యక్రమంలో. మున్సిపల్ ఆర్ ఐ నానాజీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కర్‌ను అగౌరవపర్చడం తగదు

## – అమిత్ షాను అన్నిపదవుల నుండి తొలగించాలి




బుట్టాయగూడెం,మేజర్ న్యూస్: కేంద్ర హోం శాఖామంత్రి అమిత్ షా పార్లమెంట్ సభలో రాజ్యాంగ నిర్మాత డా.బి ఆర్ అంబేద్కర్‌ను అవమాన పరిచేలా మాట్లాడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆదివాసీ విజ్ఞాన కేంద్రం నుండి బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు కారం భాస్కర్ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, దర్భుల రమేష్ లు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత డా బిఆర్ అంబేద్కర్‌ను చట్టసభల్లో అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా పై ఇప్పటివరకు మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం బాధాకరం అన్నారు. డా బి ఆర్ అంబేద్కర్‌కు జాతి ప్రజలకు అమిత్ షా క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో ప్రజాసంఘాలతో మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరావు, చంద్రు బుల్లెమ్మ, తెల్లం వెంకటలక్ష్మి,గిరిజన జ్యోతి అధ్యక్షులు కూరం సత్యనారాయణ,వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉడతా వెంకటేశ్వరరావు,రైతు సంఘం నాయకులు కోర్స జలపాలు, వెట్టి వీరయ్య,యం నరేంద్ర, యం శ్రీదేవి,పి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## కిలాడి భవానికి పన్ ఇండియా ఐకాన్ టీచర్ అవార్డు ప్రదానం



మండవల్లి మేజర్‌న్యూస్ : మండవల్లి గ్రామానికి చెందిన కిలాడి శ్రీనివాసరావు,జ్యోతిల కుమార్తె కిలాడి భవాని ఈ అవార్డు అందుకున్నారు. కైకలూరు శ్రీ చైతన్య హైస్కూల్ హిందీ టీచర్‌గా భవాని పనిచేస్తున్నారు. ఇటీవల గుంటూరులో గ్రాడ్యు యేట్ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు అవార్డు ప్రధాన చేయడం జరిగింది. కిలాడి భవాని అవార్డు పొందినందుకుగాను పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## అధికారులకు సత్కారం



పాలకొల్లు, మేజర్ న్యూస్: మండలంలో ఎల్ఎస్‌డిజి శిక్షణా కార్యక్రమం నవంబర్ 22 నుండి డిసెంబర్ 12 వరకు నిర్వహించారు,శిక్షణ తరగతులు పూర్తి అయిన అనంతరం శుక్రవారం శిక్షణ ఇచ్చిన ఈ ఓపిఆర్‌డి టి.మూర్తి బాబు, గుడాల హరిబాబు, ఏపిఎం చారి. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సురేష్‌లను సత్కరించారు, ఈ కార్యక్రమంలో పోలేపల్లి కార్యనిర్వహణ అధికారి పాలా శ్రీనివాస్, లింగం సత్యనారాయణలో పాల్గొన్నారు.

## అభయ రక్షక మహిళా దళం గస్తీ : ప్రజలు సహకరించాలని వినతి





ఏలూరు, మేజర్ న్యూస్ : జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు మహిళా అభయ రక్షక దళం జిల్లావ్యాప్తంగా గస్తీ నిర్వహించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మహిళా అభయ రక్షక దళం గస్తీ నిర్వహించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, పబ్లిక్ ప్రదేశాలు, స్కూల్స్, కాలేజీల వద్ద మహిళలు, బాలికలపై ఏవైనా వేధింపులు గురికాకుండగా గస్తీ చర్యలు చేపట్టారు. అవగాహన కార్యక్రమాలు సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే అనర్థాలు సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలకు రక్షణ, ఆకతాయి వేధింపుల నివారణ, నేరాలను నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇచ్చారు. విద్యార్థినులకు బస్టాండ్లు, పబ్లిక్ ప్రదేశాల్లో రక్షణ కల్పించారు.ఏదైనా ఆపద సమయాల్లో డయల్ 112 ద్వారా సహాయం పొందవచ్చని, పోలీస్ వారు 10 నిమిషాల్లో చేరుకుంటారని తెలిపారు.సైబర్ నేరాలు ఎదురైతే 1930 కి ఫిర్యాదు చేయాలని, సెంట్రల్ సైబర్ సెల్ ద్వారా సమస్య పరిష్కారం పొందవచ్చని సూచించారు. చుట్టు పక్కల అసాంఘిక కార్యకలాపాలను గుర్తించి 95550351100 వాట్సాప్ నెంబర్‌కు సమాచారాన్ని పంపించాలని ప్రజలను కోరారు. అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు పోలీస్ చర్యలకు ప్రజల సహకారం అవసరమని తెలియజేశారు.

## సిఎం సహాయ నిధి చెక్కులు అందించిన విప్ నాయకర్




నరసాపురం,మేజర్ న్యూస్: నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నియోజకవర్గ శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్ పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో మొగల్తూరు మండలం కొత్తోట గ్రామానికి చెందిన రావి పెద్దిరాజుకు రూ.1,64,733, నర్సాపురం పట్టణం 19వ వార్డు రాయపేట కు చెందిన అల్లం శ్రీనివాసరావుకు రూ.1,40,407 , శేరేపాలెం గ్రామానికి చెందిన దూసనపూడి వరలక్ష్మి రూ.40వేలు చెక్కులను అందించారు.ఈ నిధులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ కుటుంబాలకు ఎంతో ఉపయోగపడతాయని, లబ్ధిదారులను వారి కష్ట కాలంలో ప్రభుత్వం వారితో నిలబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన టిడిపి బిజెపి నాయకులు కార్యకర్తలు జనసైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పెదవేగి ఆయిల్ ఫెడ్‌ను ప్రైవేటీకరించవద్దు : సిపిఎం

ఏలూరు,మేజర్‌న్యూస్ : పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని ప్రైవేటీకరించవద్దని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో రోజురోజుకీ ఆయిల్ పామ్ విస్తీర్ణం పెరుగుతోందని, దేశంలోనే అత్యధికంగా ఏలూరు జిల్లాలో ఆయిల్ పామ్ సాగు ఉందన్నారు. సహకార రంగంలో ఉన్న ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని అభివృద్ధి చేయకుండా ప్రైవేటీకరించాలనే ప్రభుత్వ యోచన విరమించుకోవాలని కోరారు. ఒకవైపు ప్రైవేట్ ఫ్యాక్టరీలు లాభాలు గడించి మరిన్ని యూనిట్లు ఏర్పాటు చేస్తుంటే పెదవేగి ఆయిల్ ఫెడ్‌కర్మాగారం అభివృద్ధికి నోచుకోకపోవడం, పాలకులు ఆధునికరించకపోవడం అన్యాయమని విమర్శించారు. ఆయిల్ ఫెడ్ కర్మాగారం ఆధునీకరణకు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారంలో వస్తున్న రికవరీ శాతం ఆధారంగానే ధర నిర్ణయం జరుగుతుందని చెప్పారు. తెలంగాణ రికవరీ శాతంపై ఆధారపడి ధర నిర్ణయించడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో ఆంధ్ర ప్రాంత ఆయిల్ పామ్ గెలలు తెలంగాణలోని అప్పారావుపేట తెలంగాణ ఆయిల్ ఫెడ్ కర్మాగారంలో మిల్లింగ్ చేస్తే తెలంగాణ కంటే ఆంధ్ర గెలలకు ఎక్కువ రికవరీ శాతం వచ్చిందని గుర్తు చేశారు.

## రేషన్ బియ్యం అక్రమ రవాణా ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు






### – చర్యలు కఠినంగా ఉంటాయని జిల్లా కలెక్టర్ నాగరాణి హెచ్చరిక

భీమవరం,మేజర్ న్యూస్: శుక్రవారం స్థానిక కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో పిడిఎస్ రైస్ అక్రమ రవాణాను అరికట్టడం, ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్టతకు చర్యలు, బహిరంగ మార్కెట్లో నిత్యవసర ధరల నియంత్రణకు చర్యలు తదితర అంశాలపై సభ్యులతో చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లా డుతూ జిల్లాలో పిడిఎస్ రైస్ అక్రమ రవాణా నిరోధానికి చర్యలు చేపట్టడం జరిగిందని, చెక్ పోస్ట్ లు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఏ మార్గంలోనైనా అక్రమ రవాణా జరిగితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. 5,67,700 రైస్ కార్డులు ఉన్నాయని ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు 356 ఎండియు వాహనాల ద్వారా బియ్యం పంపిణీ జరుగుతుందన్నారు. పిడిఎస్ రైస్ అమ్మిన వారిపై, కొన్న వారిపై ఇకనుండి పూర్తి నిఘా ఉంటుందని తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నిత్యవసర వస్తువుల నియంత్రణకు ఇప్పటికే హోల్‌సేల్ దారులతో ఫలుదపాలుగా సమావేశాలు ఏర్పాటు చేసి, ఉల్లిపాయలు, టమాట,పామాయిల్ వంటి వస్తువులను వినియోగదారులకు అందుబాటు ధరలలో ఉంచడం జరిగిందన్నారు. తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ఖర్చు చేసే పేదలకు బియ్యమును అందజేస్తే, వారి వద్ద నుండి తక్కువ వరకు కొని అక్రమ రవాణా చేయడం ఉపేక్షించరానివిషయం ఉన్నారు. ఈ సమావేశంలో విజిలెన్స్ సభ్యులు హనుమంతరావు, మంగరాజు,మేళం దుర్గాప్రసాద్ డిఎస్ఓ ఎన్.సరోజ, సివిల్ సప్లైస్ డి.ఎం శివరాం ప్రసాద్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, రేషన్ డీలర్స్ అసోసియేషన్స్, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి : సర్పంచ్ రహిమా బేగం హసేనా



ఏలూరు,మేజర్ న్యూస్: భీమడోలు మండలం పోలసాని పల్లి గ్రామంలో వ్యాపారస్తులకు సర్పంచ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు.గ్రామంలో ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసుల వాడకం పూర్తిగా నిషేధించాలి అని ఈ సందర్భంగా ఈరోజు సాయంత్రం గ్రామంలోని వ్యాపారులందరికి ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన కల్పించి వారికి నోటీసులు స్వయంగా అందచేసారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత గ్రామంగా మన గ్రామాన్ని తీర్చిదిద్దాలి అని సర్పంచ్ రహిమా బేగం హసేనా అన్నారు.ఈ కార్యక్రమంలో రహీమాబేగం హసేన పంచాయతీ కార్యదర్శి యు జయ రామకృష్ణ,సచివాలయ సిబ్బంది,పంచాయతీ సిబ్బంది ,వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రు ల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.3872.6 కోట్లు మంజూరు

## ఏపీలో 3 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు ఆమోదం



**దిల్లీ/ఏలూరు, సూర్య బ్యూరో:** గత ఐదేళ్లలో ఏపీలో ముఖ్యంగా ఏలూరు జిల్లా పరిధిలో ఆసుపత్రుల నిర్మాణం, వర్గోన్నతికి సంబంధించి వివిధ పథకాల కింద ఎన్ని నిధులు కేటాయించారని పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ సమాధానం ఇచ్చారు.
గత ఐదేళ్లలో ఏపీకి ఎన్.హెచ్.ఎం పథకం కింద 6 పీ.హెచ్.సిలు మంజూరు చేయగా 5 పూర్తయ్యాయని, ఏలూరు జిల్లాకు నాలుగు మంజూరు చేయగా పురోగతిలో ఉన్నట్లు, మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ వింగ్స్ ఏపీకి 4 మంజూరు చేయగా 3 పూర్తయినట్లు, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్ ఏపీకి 2,727, ఏలూరు జిల్లాకు 107 మంజూరు చేయగా పూర్తయినట్లు వివరించారు, 15వ ఆర్థిక సంఘం కింద బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్స్ ఏపీకి 334 మంజూరు చేయగా 35, ఏలూరు జిల్లాలో 15 మంజూరు చేయగా ఒకటి పూర్తయినట్లు, ఏపీకి 9 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు మంజూరు చేసినట్లు, ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్స్ ఏపీకి 26 మంజూరు చేయగా 13 పూర్తయినట్లు వెల్లడించారు.ఏలూరు జిల్లాకు ఒకటి మంజూరు చేసినట్లు, క్రిటికల్ కేర్ బ్లాగ్స్ ఏపీకి 24, ఏలూరు జిల్లాకు ఒకటి మంజూరు చేసినట్లు మంత్రి ప్రకటించారు.గత ఐదే ళ్లలో నేషనల్ హెల్త్ మిషన్ కింద మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి 2021-22 ఆర్థిక సంవత్సరం నుండి 2025-26 ఆర్థిక సంవత్సరం వరకు ఏపీకి కింద 1271.8 కోట్లు ఆమోదించినట్లు, 2021-22 నుండి 2025-26 వరకు ఏపీకి హెల్త్ గ్రాంట్ కింద మొత్తం రూ. 2600.8 కోట్లు చొప్పున మొత్తం రూ.3872.6 కోట్లు ఆమోదించినట్లు మంత్రి బదులిచ్చారు.ఈ పథకం కింద ఏపిలో పిడుగురాళ్ల, పాడేరు, మచిలీపట్నంలో మెడికల్ కాలేజీలతో సహా మూడు దశల్లో 157 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు ఆమోదించగా, ఏపీలోని మూడు మెడికల్ కాలేజీలలో పాడేరు, మచిలీపట్నం పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు.

# ఏలూరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే 'బడేటి'



**ఏలూరు,మేజర్ న్యూస్:** పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఎమ్మెల్యే బడేటి చంటి పునరుద్ఘాటించారు. తమ సమస్యలు పరిష్కారమవ్వడం తో కృతజ్ఞతాపూర్వకంగా కొందరూ, తమ సమస్యల పరిష్కారం కోరుతూ మరికొందరూ చేరుకుంటూ ఉండడంతో ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజలతో నిండి ఉంటుంది. ఇదేక్రమంలో శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వినతులందించేందుకు వచ్చిన వారితో కిక్కిరిసింది. తనను కలిసేందుకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే బడేటి చంటి వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. నేనున్నానంటూ వారికి భరోసా కల్పించారు. కొందరు తమకు ఇల్లు కట్టుకునేందుకు రుణాలు మంజూరు చేయించాలని కోరగా, మరికొందరు ఉద్యోగులు బదిలీల అంశాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా తాను కృషిచేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు మామిళ్ళపల్లి పార్థసారధి, పెద్దిబోయిన శివప్రసాద్, అమరావతి అశోక్, ఆర్నేపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# 22న జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా జీ తెలుగు అందిస్తున్న 35 చిన్న కథ కాదు వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ !




ఏలూరు,మేజర్ న్యూస్: వినోదంతోపాటు విజ్ఞానం పెంపొందించే కార్యక్రమాలతో అలరించేజీ తెలుగు ఈ సంవత్సరం జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని 35 చిన్న కథ కాదు సినిమా ప్రసారం చేసేందుకు సిద్ధమైంది. ప్రఖ్యాత గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాసరామానుజన్ గణితశాస్త్రానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయనకు నివాళులు అర్పిస్తోంది.జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా 35 చిన్నకథ కాదు వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ డిసెంబర్ 22న (ఆదివారం) మధ్యాహ్నం 3 గంటలకు జీ తెలుగులో మాత్రమే! 35 చిన్న కథ కాదు సినిమా కథ లెక్కల చుట్టూ తిరుగుతుంది.

తిరుపతిలో నివసించే మధ్యతరగతికి చెందిన భార్యాభర్తలు సత్య ప్రసాద్ (విశ్వదేవ్రాచ కొండ), సరస్వతి (నివేదా థామస్). వారికి ఇద్దరుకొడుకులు అరుణ్(అరుణ్దేవ్ పోతుల), వరుణ్(అభయ్ శంకర్).అరుణ్ గణిత నియమాలు తప్పని వాటిని ఎందుకు పాటించాలంటూ ప్రశ్నలు అడుగుతూ ఉంటాడు.మ్యాథ్స్ టీచర్ చాణక్య వర్మ(ప్రియదర్శి) అరుణ్ని జీరో అని పిలవడంతో సరస్వతి, సత్య ఆందోళన చెందుతారు. అరుణ్ అడిగే ప్రశ్నలేంటి? సరస్వతి తన కొడుకు సమస్యను ఎలా పరిష్కరిస్తుంది? అనేవిషయాలు తెలియాలంటే జీ తెలుగులో ప్రసారమయ్యే 35 చిన్న కథ కాదు సినిమా చూడాల్సిందే. గణిత శాస్త్రంలో అంకెలు సృష్టించే మాయాజాలం,ఆకట్టుకునే కథాంశంతో మేళవించిన అసాధారణ కథతో రూపొందిన ఈసినిమాకి నందకిషోర్ ఈమని దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో నివేదా థామస్,ప్రియదర్శి, విశ్వదేవ్ రాచకొండ, గౌతమి కీలక పాత్రలు పోషించారు. ఎమోషనల్ అండ్ ఫ్యామిలీఎంటర్టైనర్గా అలరించిన 35 చిన్న కథ కాదు సినిమాని జీ తెలుగు వేదికగా మీరూచూసేయండి.

## ఎమ్మెల్యే కార్యాలయం దగ్గర క్రిస్మస్ ఆన్ వీల్స్



**నరసాపురం,మేజర్ న్యూస్:** స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి నిర్వహించిన క్రిస్మస్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. నాయకర్ మాట్లాడుతూ, ఈ క్రిస్మస్ శుభ సందర్భంలో ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, సంతోషాలను ఆ ప్రభువు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను" అన్నారు. విజయవంతంగా నిర్వహించిన చదలవాడ మెర్లిన్ ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

## జనవరి 19 వరకు కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు




**భీమవరం,మేజర్న్యూస్:** పశ్చిమగోదావరిజిల్లా కలెక్టర్ కార్యాలయం భీమవరం నందు కార్గోడోర్ డెలివరీ మాసోత్సవాలు కార్యక్రమాన్ని కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఎస్.పి అద్నాన్ నయిన్ అస్మి ,తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్,జిల్లా ట్రాన్స్ పోర్ట్ అధికారి ముఖ్య అతిదులుగా విచ్చేసి కార్గో డోర్ డెలివరీ మాసొత్సవాలు ప్రారంభించారు,ఈ కార్యక్రమంలో భీమవరం డిపో మేనేజర్ పి ఎన్వి ఎం సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాలు ప్రకారం కార్గో బుక్కింగ్ చేయు కస్టమర్స్ అందరికీ వచ్చే జనవరి 19 వరకూ కార్గో డోర్ డెలివరీ చేయడం జరగుతుంది అని తెలియజేసారు. కార్గో మాసోత్సవాలు కార్యక్రమంలో డి.పి.టీ.ఒ ఆఫిస్ ఎల్.ఒ,కార్గో డి.ఎం.ఇ ఉద్యోగులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ని అవమానిస్తారా ?

- కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్



**బుట్టాయిగూడెం,మేజర్న్యూస్:** రాజ్యాంగం మీద ప్రమాణం చేసి రాజ్యాంగం రూపొందించిన వారిని అవమానపరచడం అత్యంత దారుణమని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ ఆవేదన వ్యక్తం చేశారు. బుట్టాయిగూడెంలోని అంబేద్కర్ కాలనీ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం దళితులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ అమిత్ షా రాజ్యాంగబద్ధంగా పదవిలోకి వచ్చారని అది అంబేద్కర్ పెట్టిన బిక్షనీ మర్చిపోకూడదని గుర్తు చేశారు. ఇటీవలే ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు అంబేద్కర్ ఫ్లెక్సీని చింపివేయడం, ఇప్పుడు కేంద్రమంత్రి అంబేద్కర్‌ని అవమా నించేలా మాట్లాడటం బాధాకరమైన విషయం అన్నారు. అంబేద్కర్‌ని అవమానించిన వారిపై చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో దళితుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

బిజెపి ప్రభుత్వం దుర్మార్గాన్ని ఎండగడతామని ఆయన పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వంలో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు తలారి రాజు, కన్నిపాటిశేఖర్,కిరణ్, వెంకటేశ్వర రావు,వాసు, వేణు తదితరులు ఉన్నారు.